## క్లుప్తంగా

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



బూరుగలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలోని బూరగ గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### నేడు శంకుస్థాపన

పాలకొండ రూరల్:పాలకొండ - రాజాం రహదారి నిర్వహణకు సంబంధించి శనివారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన జరగనుంది. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కృషితో ఈ రహదారి పునర్నిర్మాణానికి రూ. 3.75 కోట్లు మంజూరైనట్లు ఆర్అండ్బీ జేఈ జగన్మోహనరాజు శుక్రవారం తెలిపారు. ఈ నిధులతో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి సంకిలి చక్కెర కర్మాగారం వరకు రహదారిని పునరుద్ధరిస్తామన్నారు.

### వేగవంతంగా హద్దు రాళ్ల ఏర్పాటు



రుద్రిపేటలో హద్దు రాళ్లు వేస్తున్న సర్వే సిబ్బంది

పాలకొండ: సమగ్ర భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో ముమ్మరంగా హద్దు రాళ్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని రుద్రిపేట, కొండాపురం తదతర గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల సర్వేయర్ వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలోనే హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో రైతులకు ఎటువంటి భూ వివాదాలు లేకుండా ఈ సర్వే దోహద పడుతుందని తెలిపారు.

### కంటి శస్త్రచికిత్సలకు అవ్వాతాతల తరలింపు

కురుపాం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న 45 మందిని ఆపరేషన్ల కోసం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్టు మన్యం జిల్లా వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. అంతర కుసుమం, కొయ్యకాండ నేత్ర సమస్యలు ఉన్న వారిని గుర్తించామన్నారు.

### విద్యుత్ లైన్ల పునరుద్ధరణ

భామిని: మండలంలోని సొలికిరి కాలనీ శివారులో విద్యుత్ లైన్ల పునరుద్దరణ పనులు శుక్రవారం చేపట్టారు. విద్యుత్ స్తంభాలు మార్చి కొత్త లైన్లు వేశారు. ఎంపీటీసీ కొత్త కోట చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

### ఘనంగా విషు ఉత్సవం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం విషు ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి కేరళ రాష్ట్ర సంప్రదాయం ప్రకారం ధర్మశాస్తా సేవా సంఘం ఆధ్వర్యంలో విషు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామితో పాటు వినాయక, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, సరస్వతి విగ్రహాలకు పంచామృతాభిషేకాలతో పాటు పూలాభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మక్కువ: మండల కేంద్రంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు ఆరవెల్లి విజయకుమార్‌శర్మ, అర్చకుడు వివేక్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గురుస్వామి కాలహస్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

### కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సీతానగరం: మండలకేంద్రం సీతానగరంలోని సుంకరివీధిలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి మండల ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు సచివాలయం ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ సుంకరివీధి పెద్దలు తమకు సామాజిక భవనంలేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తేవడంతో కమలాతోటలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సామాజిక భవనం నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు మండల ఇంజినీరింగ్ అధికారితో పాటు గ్రామ పెద్దల సమక్షంలో స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు.

# అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో అంతా నడుద్దామని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని వాడవాడలా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని పలువురు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



జియ్యమ్మవలస: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, ఎంపీపీ శెట్టి పద్మావతి తదితరులు



పాలకొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఎస్పీ కృష్ణారావు తదితరులు



కొమరాడ: గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాలకొండ రూరల్: చిన్నమంగళాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు



గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ బీనమయ్య, అధికారులు



భామిని: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు



కురుపాం: మొండెంఖల్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి తదితరులు



గరుగుబిల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి తదితరులు



గరుగుబిల్లి: దళాయివలసలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు

# వాడవాడలా.. జగనన్నే మా భవిష్యత్తు



పాలకొండ: వెలగవాడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న కన్వీనర్లు



భామిని: నేరడి-బీలో ఇంటింట ప్రచారంలో పార్టీ నాయకులు, గృహసారథులు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వాడవాడలా శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. జగనన్న పాలనలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి వివరించారు. పలువురు స్వచ్ఛందంగా స్టిక్కర్లు తీసుకుని తమ ఇళ్లకు అతికించుకున్నారు. జగనన్నకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. - సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: గొట్టివలసలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



సీతంపేట: శంబాంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ తిరుపతిరావు, తదితరులు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పెద్దగూడ గిరిజన గ్రామంలో ఈ నెల 10న ఇద్దరు చిన్నారులు ఆరిక సబస్టీయన్, ఊయక సందీప్ బావిలో పడి మృతి చెందగా ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం పెద్దగూడ గిరిజన గ్రామానికి వెళ్లి వారి తల్లిదండ్రులైన ఆరిక ధనుంజయ, రాములమ్మ, ఊయక మల్లేష్, మాలతిలను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరు కుటంబాలకు చెరో రూ.25వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ మన మధరావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గౌర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ రాజేశ్వరి, విద్యారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదు, నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

# పైడితల్లి అమ్మవారి పండుగకు సర్వం సిద్ధం



వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారు



సుందరంగా ముస్తాబవుతున్న పైడితల్లి అమ్మవారి ఆలయం

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి మహోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 16న ఆదివారం పండుగ చాటింపు వేస్తారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి పర్యవేక్షణలో మేజరు పంచాయతీ సర్పంచ్ పులిటి గౌరమ్మ ఆధ్వర్యంలో జరగనున్న పండుగను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఇదీ ఆచారం**

గ్రామదేవత పండుగను ఎంతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడం ఇక్కడి ఆచారం.

- ఈ నెల 16వ తేదీ ఆదివారం గ్రామదేవత శ్రీపైడితల్లి అమ్మవారిని తీసుకొని వచ్చుటకు చాటింపు వేస్తారు.
- 27న గురువారం శ్రీనూకాలమ్మ చిన్న పాప, పెద్ద పాప పండుగ మహోత్సవం జరుపుతారు.
- 30న ఆదివారం ఉజ్జిడిబండి మహోత్సవం నిర్వహిస్తారు.
- మే 1న సోమవారం పైడితల్లి అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించి పండుగ మహోత్సవాలను ప్రారంభిస్తారు.
- 3 నుండి అమ్మవారి ఘటాలు పట్టణ వీధుల్లో తిప్పుతారు.
- 7న ఆదివారం ప్రధాన రహదారిలో అమ్మవారి ఉయ్యాల - కంబాల మహోత్సవం నిర్వహిస్తారు.
- 8న సోమవారం ఉదయం అమ్మవారికి ప్రీతికరమైన తోలెళ్ల మహోత్సవం నిర్వహిస్తారు.
- 9న మంగళవారం ఉదయం ఊరు కట్టడి చేసి సాయంత్రం అంజలి రథం, సిరుమాను మహోత్సవం నిర్వహించి 10న బుధవారం ఉదయం అమ్మవారిని ఊరు నుండి వనంకు పంపించడంతో పండుగ మహోత్సవములు ముగుస్తాయి.

**ఇదీ చరిత్ర**

వీరఘట్టం గ్రామదేవత పండుగకు సుమారు 400 ఏళ్ళ చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. పూర్వం విజయనగరం సామ్రాజ్యంలో వీరఘట్టం సామంత రాజ్యంగా ఉండేదని, ఓ ఏడాది కప్పం కట్ట లేదని పైడితల్లి అమ్మవారిని విజయనగరం రాజులు తీసుకువెళ్లిపోతుంటే బార్నాల వంశీకులు అడ్డుకున్నారని, కప్పం కట్టి అమ్మవారిని విడిపించారని.. అదే ఏట పైడితల్లి అమ్మవారిని తమ ఇంటి ఆడపిల్లగా చూసుకుంటూ ఊరంతా పండు గ జరుపుకున్నారని చెబుతారు. అప్పటి నుండి ఐదేళ్లకొకసారి లేదా పదేళ్లకు ఒకమారు పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

## జీడీఎస్ ఉద్యోగుల భద్రతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్

పాలకొండ: పోస్టల్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. భారతీయ తపాల ఉద్యోగుల సంఘం పార్వతీపురం డివిజన్ మొదటి మహాసభలు పట్టణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అతి పెద్ద సంఘం అయిన బీఎంఎస్‌లో తపాల ఉద్యోగుల సంఘం విలీనం కావడం శుభ పరిణామమని అన్నారు. బీఎంఎస్ నిరంతరం తపాల ఉద్యోగుల సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. పోస్టల్ ఉద్యోగులు ఎప్పుడు ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉంటారని తెలిపారు. బీపీఈఏ డివిజన్ నాయకుడు రణస్థలం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో సంఘ నాయకులు సురకత్తులు శ్రీకర్‌బాబు, చంద్రశేఖర్, వెంకయ్య, మహేష్‌సింగ్, జయశంకర్, ఎ.రవిబాబు, ఎం.రామారావు, టి.రామారావు, జీవీ రమణ, సీఆర్‌బీ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన జీడీఎస్‌లకు సన్మానించారు.

## వేతనదారులందరికీ 'ఉపాధి'



పెదఖేర్జల కనపల చెరువు వద్ద మస్తరును పరిశీలిస్తున్న ఏపీఓ బాలకృష్ణ

కొమరాడ: ఉపాధి హామీ పథకంలో వేతనదారులందరికీ కచ్చితంగా పని కల్పిస్తున్నామని ఏపీఓ బాలకృష్ణ అన్నారు. పెదఖేర్జలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోతే సిబ్బంది, మేట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రస్తుతం ఐదు వేల మంది పైబడి వేతనదారులు పని చేస్తున్నారని వెల్లడించారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో అగ్నిమాపక సేవలు అత్యంత అవసరమన్నారు. వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. అగ్నిమాపక శాఖాధికారి సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు

కురుపాం: బాధిత కుటుంబ సభ్యులు వైఎస్సార్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, గుమ్మిడిగూడ సర్పంచ్ శెట్టి సురేష్ అన్నారు. గుమ్మిడిగూడ గ్రామానికి చెందిన బీపక మాధవరావు నాలుగు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొలత రాళ్లు సక్రమంగా వేయాలి

భామిని: మండలంలోని వడ్డంగి, పక్కుడుబద్ర, బొమ్మికలో కొనసాగుతున్న కొలత రాళ్ల వేత కార్యక్రమాన్ని మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఎంఆర్ఐ ఎస్.రాంబాబు శుక్రవారం పరిశీలించారు. భూ సర్వేలో గుర్తించిన జిరాయితీ భూముల సరిహద్దులు గుర్తింపు, కొలతలు సక్రమంగా ఉండాలని సూచించారు. వీఆర్‌ఓలు, సహాయ సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## జోగులడుమ్మలో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని జోగులడుమ్మలో ఎంపీడీఓ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులకు భూమి పూజ చేశారు. రూ.7లక్షలతో ఆరు పనులు గుర్తించి ప్రారంభించారు. జియ్యమ్మవలసలో రూ.16లక్షలతో పది పనులు ప్రారంభించినట్టు ఎంపీడీఓ తెలిపారు. సంబంధిత పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సభలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కిరప గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన పనులు గూర్చి చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ